సాక్షి జగిత్యాల

శనివారం : 12 : ఆగస్టు : 2023



మినీ ట్యాంక్ బండ్‌లో బోట్లు

కోరుట్ల: మద్దులచెరువు మినీట్యాంక్ బండ్ ఆధునికీరణ చివరి దశకు చేరడంతో శుక్రవారం రెండు బోట్లను అందులో దించారు.



పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

సారంగాపూర్ : పాఠశాలల్లో పీఆర్టీయూ నేత అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు.

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

ధర్మపురి: శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి విగ్రహాన్ని రంగు రంగుల పూలతో చూడముచ్చటగా అలంకరించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసచార్యులు మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక పూజలు చేశారు.

పద్మశాలీలు ఐక్యత చాటాలి



నరహరిని సన్మానిస్తున్న పద్మశాలీలు

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలో ఆదివారం చేపట్టిన ఆత్మగౌరవ సభలో పద్మశాలీల ఐక్యత చాటాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నరహరి సూచించారు. స్థానిక మార్కండేయ మందిరంలో నాయకులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. నాయకులు బసవ లక్ష్మీనర్సయ్య, రుద్ర శ్రీనివాస్, ధ్యావనపల్లి రాజారాం తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు పటిష్ట భద్రత



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: స్వాతంత్య్ర వేడుకలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తామని ఎస్పీ భాస్కర్ అన్నారు. ఖిలాగడ్డలో చేపట్టిన వేడుకల భద్రతా ఏర్పాట్లను శుక్రవారం ఎస్పీ పరిశీలించారు. వేడుకలకు హాజరయ్యే వీవీఐపీలు, వీఐపీలు, అధికారులు, విద్యార్థులు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు చేపడతామని చెప్పారు. అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ వెంకటస్వామి, టౌన్ పోలీసు అధికారి నటేశ్, ఆర్ఐ వేణు పాల్గొన్నారు.

టీకాలు వేయించండి



మాట్లాడుతున్న డాక్టర్ సాయిరంగనాథ్

వెల్గటూర్(ధర్మపురి): గర్భిణులు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ప్రతినిధి సాయి రంగనాథ్ సూచించారు. ఈనెల 12వ తేదీ వరకు నిర్వహించే మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని శుక్రవారం ఆయన తనిఖీలు చేశారు. గర్భవతులు, తల్లులతో మాట్లాడారు. వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యత గురించి వివరించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీనివాస్, వైద్యాధికారి రమేశ్, సర్పంచ్ మేరుగు మురళీగౌడ్, హెల్త్ ఆఫీసర్ సాగర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాల భవనంలోకి ఎంపీడీవో కార్యాలయం




స్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు

సాక్షి ఎఫెక్ట్..

జగిత్యాల: బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం పాఠశాల భవనంలోకి తరలించారు. శిథిలావస్థకు చేరిన ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది హెల్మెట్ ధరించి విధులు నిర్వర్తిస్తున్నారంటూ 'హెల్మెట్ ధరించి విధులు' శీర్షికన ఈనెల 9న 'సాక్షి' ప్రధాన సంచికలో కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారులు స్పందించారు. బీర్‌పూర్ మోతీనగర్‌లోని మూతపడిన ప్రభుత్వ పాఠశాల భవనంలోకి ఎంపీడీవో కార్యాలయం తరలించారు. తమ బాధలు తొలగించిన 'సాక్షి'కి సిబ్బంది, ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.





తాగుతూ.. ఊగుతూ..

• మత్తులో యువత చిత్తు • జోరుగా గంజాయి విక్రయాలు • రంగంలోకి దిగిన పోలీసులు • జిల్లాలో విస్తృతంగా దాడులు

జగిత్యాలక్రైం: జిల్లా యువత గంజాయి మత్తులో జోగుతోంది. కళాశాల విద్యార్థులే కాదు.. పాఠశాల విద్యార్థులూ బానిసలవుతున్నారు. మరోవైపు.. విక్రయదారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. తొలుత అతి తక్కువ ధరలకు అమ్ముతూ యువత అలవాటు కాగానే ధరలు అమాంతం పెంచేస్తున్నారు.

సంవత్సరం	నిందితులు	కేసులు	స్వాధీనం చేసుకున్న గంజాయి(కేజీల్లో)
2021	38	14	30.165
2022	32	11	17.620
2023 (ఇప్పటిదాకా)	18	05	71.238

ఎంత నాణ్యంగా ఉంటే అంత ధర ఎక్కువ..

→ వాస్తవానికి గంజాయి గోధుమ, ఆకుపచ్చ రంగుల్లో లభిస్తుందని పోలీసులు చెబుతున్నారు.

→ గోధుమ రంగులోని గంజాయి నాణ్యంగా ఉంటుందని, చిన్నప్యాకెట్ (10గ్రాముల నుంచి 20గ్రాముల) వరకు రూ.800 ధర పలుకుతోందని అంటున్నారు.

→ ఆకుపచ్చ రంగు గంజాయి ప్యాకెట్(10 గ్రాముల నుంచి 20 గ్రాముల) వరకు రూ.200 నుంచి రూ.1,000 వరకు ధర పలుకుతోంది.

ఇతర జిల్లాల నుంచి సరఫరా..

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతోపాటు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించిన కవ్వాల్ అభయారణ్యంలోని ఉట్నూరు, జైనూరు, సిర్పూర్(యు), లింగాపూర్, తిర్యాణి, కాసిపేట తదితర ప్రాంతాల్లో అంతర పంటగా గంజాయి సాగుచేస్తున్నారని పోలీసులు గుర్తించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లోనూ పండిస్తున్నారు. అక్కడి నుంచి జగిత్యాల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి, మల్యాల, గొల్లపల్లి, కోరుట్ల ద్వారా జిల్లాలోని అనేక ప్రాంతాలకు చేరుతోంది. ఇటు రాజన్న సిరిసిల్ల జిల్లా మానాల నుంచి కూడా కోరుట్ల, మెట్‌పల్లి మండలాలకు చేరుతోంది. అయితే, విక్రయదారులు తమకు తెలిసిన వారు, పరిచయస్తులకే గంజాయి విక్రయిస్తున్నారు.

సాక్షి ఫోకస్

జిల్లా కేంద్రాల్లో అడ్డాలు..

→ జిల్లా కేంద్రంలోని చింతకుంటచెరువు, కండ్లపల్లిచెరువు, మోతె శివారు, అంతర్గాం రోడ్డు, ఖిలాగడ్డ, గాంధీనగర్, లింగంపేట రైల్వేస్టేషన్, గీతా విద్యాలయం గ్రౌండ్, గొల్లపల్లి రోడ్డు, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానం, చిలుకవాడ, ముప్పాల చెరువు గంజాయి తాగే యువకులకు అడ్డాలుగా మారాయి. కాస్త చీకటి పడితే యువకులు సిగరెట్లు, మద్యం, గంజాయి చిత్తుగా తాగుతున్నారు. అటుగా వెళ్తున్న మహిళలు, యువతులు, విద్యార్థినులతో అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే స్థానికులపై దాడులూ చేస్తున్నారు.

రూరల్ ప్రాంతాల్లో..

→ జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల, తిమ్మాపూర్, నర్సింగాపూర్, ధరూర్ కెనాల్, జాబితాపూర్, పొలాస శివారు, చల్‌గల్ ప్రాంతాల్లో యువకులు గంజాయి తాగుతూ మత్తులో మునిగితేలుతున్నారు.

→ కోరుట్లలోని ఝాన్సీరోడ్డు, గోరెమియా చౌరస్తా, భీమునిదుబ్బ, అల్లమయ్యగుట్ట, పాత శ్రీనివాస్ టాకీస్, జగ్జీవన్‌రామ్ చౌరస్తాలోనూ యువత అడ్డాలు ఉన్నాయి.

→ మెట్‌పల్లిలోని దీన్‌దయాళ్‌నగర్, ప్రియదర్శినినగర్, ఎస్సారెస్పీ కెనాల్, వెల్లుల్ల రోడ్డు, వేంపేట రోడ్డు గంజాయి తాగేందుకు అడ్డాలుగా మారాయి.

→ రాయికల్ మండలం కుమ్మరిపల్లి రోడ్డు, అయ్యప్పస్వామి టెంపుల్, భూపతిపూర్, అల్లీపూర్, మూటపల్లి, కొత్తపేట గ్రామాల్లోనూ గంజాయి క్రయ, విక్రయాలు, యువత తాగడం గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది.

→ ఇవన్నీ పోలీసుల దృష్టికి రావడంతో కీలక వ్యక్తులపై నిఘా పటిష్టం చేశారు.

> **నిఘా పటిష్టం**
>
> గంజాయి రవాణాపై నిఘా పటిష్టం చేశాం. విక్రయాల నియంత్రణకు ముఖ్యమైన ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నాం. గంజాయి బారినపడి యువత భవిష్యత్ నాశనం చేసుకోవద్దు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలి.
>
> – భాస్కర్, ఎస్పీ

మత్తుకు బానిసలు కావొద్దు

జగిత్యాలక్రైం: యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని డీఎస్పీ వెంకటస్వామి సూచించారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జెండా మహేశ ప్రాంతానికి చెందిన ఎస్‌కే ముకీద్ రెండున్నర కిలోల గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. ముకీద్ భద్రాచలం ఏరియా చింతపల్లిలోని సాధువుల నుంచి గంజాయి కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకొస్తున్నాడని, దీనిని అధిక ధరలకు విక్రయిస్తున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నటేశ్‌గౌడ్, ఎస్సై అబ్దుల్ రహీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటస్వామి



ఇది జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ చౌరస్తా. మూడు వైన్స్‌లు ఒకేచోట ఉన్నాయి. అందులో మద్యం కొనుగోలు చేసిన మందుబాబులు..సమీపంలోని ప్రధాన రహదారి పక్కనే ఇలా మద్యం తాగుతూ కనిపించారు. రోడ్డు వెంట వెళ్లే మహిళలు వారిని చూసి భయంతో పరుగెత్తారు.

రోడ్లపైనే తాగుతున్న మందుబాబులు

• బహిరంగ ప్రదేశాలే ప్రధాన అడ్డాలు

జగిత్యాలక్రైం: జిల్లాలో మొత్తం 71 మద్యం షాపులు ఉన్నాయి. ఇందులో 40 వైన్స్‌కే పర్మిట్‌రూమ్‌లు ఉన్నాయి. మిగతా వాటికి లేవు. వీటిలో మద్యం కొనుగోలు చేసేవారు సమీప బహిరంగ ప్రదేశాలు, వాటికి సమీపంలోని రోడ్ల వెంట మద్యం తాగుతున్నారు. తద్వారా అటుగా వెళ్లేవారు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాధితులు పోలీసులకు సమాచారం అందిస్తున్నా.. వారు వచ్చేలోపు మందుబాబులు పారిపోతున్నారు. దీంతో పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోలేకపోతున్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో విజిట్ చేయగా బహిరంగ ప్రదేశాలు, రోడ్ల వెంట మద్యం తాగుతూ వందల మంది కనిపించారు. ఇవే ఆ వివరాలు..



ఇది జగిత్యాల మిషన్ కాంపౌండ్ మైదానం. మందుబాబులు దర్జాగా మద్యం తాగుతూ ఇలా కనిపించారు. దీని పక్కనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. రాత్రి వేళ పేషెంట్లు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోనే బీసీ హాస్టల్ ఉంది. మందుబాబుల చేష్టలతో విద్యార్థులూ నిత్యం భయపడుతున్నారు. మిషన్ కాంపౌండ్‌కు చెందిన ప్రజలు రాత్రివేళ బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు.

సాక్షి విజిట్



జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల వద్ద చెట్ల మధ్య మందుబాబులు నిత్యం మద్యం తాగుతున్నారు. అక్కడే తోపుడు బండ్లు ఉన్నాయి. వాటి వద్ద తినుబండారాలు కొనుగోలు చేస్తూ అక్కడే మద్యం తాగుతున్నారు. దాని వెనుకాల ఉన్న లేడీస్ హాస్టల్ విద్యార్థులు బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు.

ఆస్పత్రి భూమి పరిరక్షించాలి

• ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల: జిల్లాలోని రాయికల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన సర్వే నంబరు 51, 52లో గల మూడెకరాలను ఆక్రమణదారుల నుంచి పరిరక్షించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శుక్రవారం అదనపు కలెక్టర్ లతకు వినతిపత్రం అందజేశారు. సుమారు 60 ఏళ్ల క్రితం రాయికల్ గ్రామ పెద్దలు ప్రధాన ఆస్పత్రి ఏర్పాటుకు గ్రామస్తుల సహకారంతో చందాలు సేకరించి ధర్మపురి నర్సయ్య, బలుసు నర్సయ్య, టి.లింగయ్య, తోట గంగారాం నుంచి 3.06 ఎకరాలు దానపత్రం ద్వారా గ్రామపంచాయతీకి అప్పగించారని గుర్తుచేశారు. ఇందులో లింబాద్రి దురుద్దేశంతో తోట గంగారాం నుంచి 1974లో సేల్‌డీడ్ నంబరు 170374 ద్వారా కొనుగోలు చేసినట్లు విక్రయ దాస్తావేజులు సృష్టించుకున్నారని ఆరోపించారు. అయినా, అప్పటి ఉమ్మడి జిల్లాలోని కోర్టు అది దాతల ద్వారా సేకరించిన స్థలం అని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికే ఇవ్వాలని తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. ఆ భూమిలో రాయికల్ మున్సిపాలిటీ నుంచి బెజ్జారపు లింబాద్రి భవన నిర్మాణ అనుమతులు పొందడంతో రాయికల్ మున్సిపాలిటీ అధికారులు నిర్మాణ అనుమతులు కల్పించడంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఆ తర్వాత చట్టరీత్యా చర్యలు తీసుకున్నారని అన్నారు. ధరణిలోనూ ప్రభుత్వ ఆస్పత్రి అధీనంలో ఉన్నట్లు స్పష్టంగా ఉందని గుర్తుచేశారు. అయినా, ఆక్రమణదారులు ఆ భూమిని ఆక్రమిస్తున్నారని, వెంటనే పరిరక్షించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



వినతిపత్రం అందిస్తున్న జీవన్‌రెడ్డి

గృహలక్ష్మి దరఖాస్తులు 28,720

జగిత్యాల: జిల్లాలో గృహలక్ష్మి పథకానికి అనూహ్య స్పందన లభించిందని అదనపు కలెక్టర్ దివాకర అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గడువులోగా జిల్లా 28,720 దరఖాస్తులు అందాయన్నారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని సూచించారు. ప్రభుత్వ సూచనలు, సలహాల ప్రకారం ఈప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ దరఖాస్తుదారు ఇంటికి వెళ్లి అర్హతలు పరిశీలించాలని చెప్పారు. రేషన్‌కార్డు కలిగి ఉండి అదే ప్రాంతంలో నివాసం ఉండాలని, సొంతస్థలం కలిగి ఉండాలని, ఆధార్‌కార్డు, ఓటరు కార్డు, కులం, ఆదాయం సర్టిఫికెట్లతోపాటు, బ్యాంక్ ఖాతా, ఖాళీ స్థలం డాక్యుమెంట్, ప్రస్తుతం నివాసం ఉంటున్న గృహం ఫొటోలు సేకరించాలని అన్నారు. ఆర్‌సీసీ స్లాబ్ ఉండి దరఖాస్తు చేసుకున్న వారు గృహం పొందేందుకు జీవో నంబరు 59 ద్వారా అనర్హులన్నారు. జీవో నంబరు 25, 33, 34 ప్రకారమే అర్హులను ఎంపిక చేయాలని ఆదేశించారు. వెరిఫికేషన్ ప్రక్రియ ఈనెల 20లోపు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు, అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దివాకర

సీఎంఆర్ చెల్లించాలి

జగిత్యాల: జిల్లాలో రైస్ మిల్లర్లు 2022–23 వానాకాలం, యాసంగి సీఎమ్మార్‌ను సెప్టెంబర్ 30వ తేదీలోగా పూర్తిచేయాలని అడిషనల్ కలెక్టర్ లత సూచించారు. జిల్లాలోని రా రైస్‌మిల్లర్లతో శుక్రవారం కలెక్టరేట్‌లో ఆమె సమావేశం నిర్వహించారు. రా, బాయిల్డ్ రైస్‌మిల్లర్లు సీఎమ్మార్ చెల్లించడంలో పురోగతి చాలా తక్కువగా ఉందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఎఫ్‌సీఐ, సీఎస్‌సీలకు త్వరితగతిన సీఎమ్మార్ చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్ పాల్గొన్నారు.

సంచలనం కోసమే లక్ష్మీరాజం హత్య

- భూదందాలు, సెటిల్‌మెంట్లకు రాచబాట వేసేందుకు ప్లాన్
- బీఆర్‌ఎస్ నేత, మాజీ కౌన్సిలర్ మర్డర్ కేసులో కొత్త కోణం
- తొమ్మిది మంది నిందితుల అరెస్ట్
- 5 కత్తులు, 4 మోటార్ సైకిళ్లు, మొబైల్‌ఫోన్లు, కారు స్వాధీనం
- విలేకరుల సమావేశంలో ఎస్పీ భాస్కర్ వెల్లడి

కోరుట్ల: సంచలనం సృష్టించి, సెటిల్‌మెంట్లు, దందాలు, వసూళ్లకు పాల్పడాలనే ఉద్దేశంతోనే మున్సిపల్ మాజీ కౌన్సిలర్, బీఆర్‌ఎస్ నాయకుడు పోగుల లక్ష్మీరాజంను హత్య చేసినట్లు ఎస్పీ భాస్కర్ వెల్లడించారు. శుక్రవారం స్థానిక ఠాణాలో జరిగిన విలేకరుల సమావేశంలో హత్య వివరాలను ఎస్పీ వివరించారు. హత్య కేసులో విత్తనాల నాగరాజు, విత్తనాల త్రిమూర్తులు, పిల్లి సత్యనారాయణ, కాసుల వంశీప్రసాద్, మధుమోహన్, గుడ్ల విశాల్, శ్రీరాముల దీపక్, మారుపాక ప్రభాస్, మార్త నర్సింహ పాలుపంచుకున్నట్లు ఎస్పీ చెప్పారు.

జూలై 30న పథకం..

➡ ఎస్పీ కథనం ప్రకారం.. సుపారీ హత్యల్లో పేరుమోసిన విత్తనాల నాగరాజు(40), అతడి తమ్ముడు త్రిమూర్తులు(38), పిల్లి సత్యనారాయణ(39)తోపాటు కాసుల వంశీప్రసాద్(24), అతడి తమ్ముడు మధుమోహన్(23), గుడ్ల విశాల్(26), శ్రీరాముల దీపక్(21), మారుపాక ప్రభాస్(18) కలిసి కోరుట్లలో పేరున్న వ్యక్తిని చంపి సంచలనం సృష్టించాలని, తద్వారా భూదందా, సెటిల్‌మెంట్లకు బాటలు వేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

➡ ఇందుకోసం జూలై 30వ తేదీన కాసుల వంశీప్రసాద్ ఇంటి వద్ద ధావత్ చేసుకున్నారు. పేరున్న బీఆర్‌ఎస్ నేత పోగుల లక్ష్మీరాజంను ఎంచుకుని అందరూ చూస్తుండగానే హత్య చేయాలని పథకం రచించారు. తద్వారా విత్తనాల నాగరాజు, అతడి అనుచరుల పేరు చెబితే ప్రజలు భయపడతారని భావించారు. ఇందులో తన పేరు లేకుండా సహకరిస్తే ఎఖీన్‌పూర్ శివారులో తనకున్న ఎకరంలో కొంత, రూ.లక్ష నగదు ముట్టజెబుతానని విత్తనాల నాగరాజు నిందితులతో ఒప్పందం చేసుకున్నాడు. అందులో భాగంగా లక్ష్మీరాజం కదలికలపై నిఘా పెట్టి సమాచారం తనకు సమాచారం చేరవేయాలని సన్నిహితుడైన మార్త నర్సింహ(29)ను ఆదేశించాడు. దీంతో గత జూలై 30నుంచి మృతుడి కదలికలు గమనించడం ప్రారంభించారు. ఈక్రమంలోనే మెయిన్ రోడ్డు వెంట ఉన్న క్రిస్టియన్ కాంపౌండ్ సమీప టీస్టాల్ అనువుగా ఉందని భావించి వివరాలు నాగరాజుకు అందించాడు.

హత్యలో లేనట్లు.. సాక్ష్యాలు సృష్టించేందుకు..

ట్రాన్స్‌కోలో పనిచేస్తూ 2021 ఎల్‌ఎండీలో జరిగిన ఓ హత్య కేసుతో సస్పెండైన విత్తనాల నాగరాజు.. పాత కేసు ముగిసే క్రమంలో తనకు మళ్లీ జాబ్ వచ్చే అవకాశాలు ఉన్నందున లక్ష్మీరాజం హత్యలో తాను పాలుపంచుకోలేదని సాక్ష్యాలు సృష్టించడానికి పకడ్బందీగా వ్యవహరించాడు. ఈనెల 8న ఉదయం 9 గంటలకు పోగుల లక్ష్మీరాజం టీస్టాల్ వద్దకు రాగానే మార్త నర్సింహ వాట్సప్ కాల్ ద్వారా నాగరాజుకు సమాచారం చేరవేశాడు. నాగరాజు, తన తమ్ముడు త్రిమూర్తులు కలిసి మోటార్ సైకిల్‌పై టీస్టాల్ వద్దకు చేరుకున్నారు. త్రిమూర్తులును బైక్‌పై ఉంచి, నాగరాజు హోటల్ లోకి వెళ్లి లక్ష్మీరాజం మెడపై కత్తితో మూడుసార్లు పొడిచాడు. ఆ వెంటనే తిరిగి వచ్చి బైక్‌పై త్రిమూర్తులుతో కలిసి పరారయ్యాడు. లక్ష్మీరాజం చనిపోని పక్షంలో మళ్లీ దాడి చేసేందుకు పిల్లి సత్యనారాయణ, విశాల్, కాసుల వంశీ ప్రసాద్, ఇతడి తమ్ముడు మధుమోహన్ మోటారు సైకిళ్లపై హత్య చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. హత్య తర్వాత విత్తనాల నాగరాజు అల్లమయ్యగుట్ట సమీపంలోని వంశీ పొలం వద్ద చేరుకుని వ్యవసాయ పనులు చేసినట్లు నటించాడు. హత్యకు వాడిన బైక్‌పై పిల్లి సత్యనారాయణ, త్రిమూర్తులును సీసీ కెమెరాలు అమర్చిన ప్రదేశాల నుంచి పరారవుతున్నట్లు చిత్రీకరించి వారిపై అనుమానం వచ్చేలా, తనపై అనుమానం రాకుండా జాగ్రత్తపడ్డాడు. కానీ, నాగరాజు నేరుగా హత్యలో పాల్గొన్నట్లుగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దాడి సమయంలో లక్ష్మీరాజం భయంతో 'నాగరాజు' అని అరిచినట్లు పోలీసుల విచారణ తేలింది. హత్యకు వినియోగించిన 5 కత్తులను పొలం వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ భాస్కర్

పీడీ యాక్ట్.. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు..

నాగరాజు, త్రిమూర్తులు, సత్యనారాయణ ఇప్పటికే ఎల్‌ఎండీ, సిద్దిపేట జిల్లా చినకోడూరు, జగిత్యాల జిల్లా మల్లాపూర్ గ్రామంలో జరిగిన హత్య కేసుల్లో నిందితులు కావడంతో వీరిపై పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. వీరితోపాటు బీఆర్‌ఎస్ నేత లక్ష్మీరాజం హత్య కేసులో పాలుపంచుకున్న వారిపైనా పీడీ యాక్ట్ నమోదు చేసేందుకూ యోచిస్తున్నారు. తద్వారా నిందితులు ఏడాదిపాటు జైలులోనే ఉండాల్సి వస్తుందని, ఇలాగైతేనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టుతో విచారణ వేగంగా జరుగుతుందని, తద్వారా నిందితులకు త్వరితగతిన శిక్ష పడుతుందని ఎస్పీ వివరించారు. నాలుగు నెలల క్రితం జరిగిన ఏబీవీపీ నాయకుడు ఠాకూర్ ప్రవీణ్‌సింగ్ హత్యకు ప్రతీకారంగా పోగుల లక్ష్మీరాజం హత్య జరిగిందన్న ప్రచారం అవాస్తవమని ఎస్పీ వివరించారు.

విచారణ పూర్తి కాలేదు..

లక్ష్మీరాజం హత్య కేసులో విచారణ పూర్తి కాలేదని ఎస్పీ భాస్కర్ తెలిపారు. ఇంకా ఎవరైనా లక్ష్మీరాజం హత్యలో పాలుపంచుకున్నారా? సుపారీ ఏదైనా ఉందా? అనే కోణంలో విచారణ చేస్తామన్నారు. నేరస్తులు వాట్సప్ కాల్స్ ఎక్కువగా వినియోగించారని, పూర్తిసమాచారం కోసం సాంకేతికంగా యత్నిస్తున్నామన్నారు. హత్య కేసు ఛేదనలో చురుకుగా వ్యవహరించిన మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐలు ప్రవీణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, ఎస్సైలు కిరణ్, కిరణ్‌కుమార్, చిరంజీవి, శ్యాంరాజ్, సతీశ్, నవీన్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

క్లుప్తంగా

పదోన్నతి పొందిన కానిస్టేబుల్‌కు బ్యాడ్జీలు



బ్యాడ్జి అందిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: పదోన్నతి మరింత బాధ్యత పెంచుతుందని ఎస్పీ భాస్కర్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ధర్మపురి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ మనోహర్ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందగా శుక్రవారం ఎస్పీ బ్యాడ్జి అందజేసి మాట్లాడారు. పోలీసు శాఖలో బాధ్యతలు నిర్వర్తించడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటస్వామి, సీఐ నటేశ్ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

కథలాపూర్(వేములవాడ): సర్దార్ సర్వాయి పాపన్న సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు మేడిపెల్లి మండలకేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా చెట్ల చంద్రశేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా బొంగొని మల్లేశం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గొల్లపెల్లి రామాగౌడ్, నాయిని శ్రీనివాస్ గౌడ్, స్వామిగౌడ్, లింగం గౌడ్, రాజాగౌడ్, బాలగౌడ్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ బాధ్యులెవరో ?

- కథలాపూర్ ప్రధానోపాధ్యాయుడు ఎనిమిది నెలల క్రితం ఎస్‌సీఈఆర్‌టీకి డెప్యుటేషన్
- వేతనాల బిల్లు కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి
- ఇన్‌చార్జి అధికారి లేకపోవడంతో పాఠశాలల పర్యవేక్షణ కరువు

కథలాపూర్(వేములవాడ): ప్రతీ మండలానికి ఒక్కరే విద్యాధికారి ఉండటంతో పాఠశాలల పర్యవేక్షణ భారంగా మారిందని.. మండలానికి నాలుగు, ఐదు స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేసి వాటి పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షించేలా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇదంతా బాగానే ఉన్నా కథలాపూర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్‌టీకి ఎనిమిది నెలల క్రితం డెప్యూటేషన్‌పై వెళ్లగా ఇక్కడ మరొకరికి బాధ్యతలు అప్పగించలేదు. ఫలితంగా పాఠశాలల పర్యవేక్షణ కొరవడి బోధన గాడి తప్పిందనే ఆరోపణలున్నాయి. వీటి పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల వేతనాల బిల్లులు ప్రతినెలా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు తయారు చేయించి సంతకాలు చేయాల్సి ఉంటుంది. అప్పుడే మంజూరవుతాయి. ఈ పనులకు సదరు ప్రధానోపాధ్యాయుడు ఉంటున్న హైదరాబాద్‌కు వెళ్లాల్సిందేనని ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించి డెప్యూటేషన్‌పై వెళ్లిన అధికారి స్థానంలో మరో అధికారికి బాధ్యతలు అప్పగించాలని, లేకపోతే సదరు అధికారిని యథావిధిగా ఇక్కడికి రప్పిస్తే సమస్య ఉండదని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

14 పాఠశాలలు..



కథలాపూర్ జెడ్పీ హైస్కూల్

50 మంది ఉపాధ్యాయులు

కథలాపూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో మండలంలోని కథలాపూర్, దుంపేట, దూలూర్, పోసానిపేట, భూషణరావుపేట, ఊటిపెల్లి, చింతకుంట, పెగ్గెర్ల గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల్లో 10 ప్రాథమిక పాఠశాలలు, నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలుండగా 50 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. కథలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లోని 13 మంది ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 50 మంది ఉపాధ్యాయులకు ప్రతినెలా వేతనాల బిల్లులు తయారు చేయించి సంతకం చేయాల్సిన బాధ్యత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడిదే. మరోవైపు ఈ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులకు అవసరమైనప్పుడు క్యాజువల్ సెలవులు మంజూరు చేయాల్సింది కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడే. కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షించి విద్యార్థులకు సరైన బోధన అందేలా చూడాలి.

మరొకరికి బాధ్యతలు అప్పగించకపోవడం కారణమేమిటో ?

కథలాపూర్ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడిగా ఉంటారు. ఎనిమిది నెలల క్రితం హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్‌టీకి డెప్యూటేషన్‌పై వెళ్లగా అప్పటి నుంచి మరొకరికి బాధ్యతలు అప్పగించకపోవడానికి కారణమేమిటనేది ఉపాధ్యాయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉపాధ్యాయుల వేతనాల బిల్లుల కోసం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడి కోసం ప్రతినెలా హైదరాబాద్‌కు వెళ్లి రావడం కష్టమని తెలుసు. అయినా ఇంకొకరికి బాధ్యతలు అప్పగించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవసరమైనప్పుడు సెలవులు మంజూరు చేసే అధికారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకే ఉంది. బాధ్యులైన అధికారి లేకపోగా బడిబాట మొక్కుబడిగా నిర్వహించడంతో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య తగ్గిందనే ఆరోపణలున్నాయి. విద్యాశాఖ ఉన్నతాధికారులు చొరవ చూపి కథలాపూర్ స్కూల్ కాంప్లెక్స్‌కు బాధ్యులను నియమించాలని కోరుతున్నారు.

హైస్కూల్ బాధ్యతలు మాత్రమే అప్పగించారు



కథలాపూర్ జెడ్పీ హైస్కూల్ బాధ్యతలు మాత్రమే నాకు అప్పగించారు. వేరే బాధ్యతలు ఇవ్వలేదు. పాఠశాలను సక్రమంగా నిర్వహిస్తున్నాం. మిగతా బాధ్యతలు డెప్యూటేషన్‌పై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడికే ఉన్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తున్నా.

– వెంకటేశం, ఇన్‌చార్జి హెచ్‌ఎం, కథలాపూర్ జెడ్పీ హైస్కూల్

ఉన్నతాధికారులకు నివేదించాం



కథలాపూర్ స్కూల్ కాంప్లెక్స్ రెగ్యులర్ ప్రధానోపాధ్యాయుడు ఎస్‌సీఈఆర్‌టీకి డెప్యూటేషన్‌పై వెళ్లారు. ఆ స్థానంలో ఎవరికి బాధ్యతలు ఇవ్వలేదు. స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణకు సీనియర్ ఉపాధ్యాయుడికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే నియమిస్తాం.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలి



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల: పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి నర్సింగరావు కోరారు. ఈ మేరకు జగిత్యాలలో ఎస్పీ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో వరుస హత్యలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఇకముందు హత్యలు జరగకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇక్కడ నాయకులు జువ్వాడి కృష్ణారావు, తిరుమల గంగాధర్ గౌడ్, జెట్టి లింగం, సత్యనారాయణ, వహీం, నయీం, హఫీజ్, శ్రీకాంత్ రెడ్డి, వసీం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం... పొలాస గ్రామ శివారులో జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కొడిమ్యాల మండలం అప్పారావుపేట గ్రామానికి చెందిన ఎడ్ల మహేశ్ ధర్మపురి గోదావరిలో పుణ్యస్నానం కోసం వెళ్తుండగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామానికి చెందిన జానకీరామ్ జగిత్యాలకు వెళ్తున్న క్రమంలో పొలాస వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎడ్ల మహేశ్‌కు తీవ్ర గాయాలుకాగా చికిత్స నిమిత్త కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. జానకీరామ్‌ను చికిత్స నిమిత్తం జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

నిరుద్యోగులతో చెలగాటం



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన నాయకులు

జగిత్యాలటౌన్: తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటమాడిందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రెంటం జగదీశ్ విమర్శించారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలనే డిమాండ్‌తో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం బైఠాయించారు. ఆయన మాట్లాడుతూ, ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులు బిచ్చగాళ్లుగా మారారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాలేదని, పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని తెలిపారు. మద్యం టెండర్లను విజయవంతంగా నిర్వహిస్తున్న ప్రభుత్వం.. ఉద్దేశపూర్వకంగానే ఉద్యోగ నోటిఫికేషన్లు లీకేజీ చేస్తోందని ఆరోపించారు. ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసిన ఠాణాకు తరలించారు. నాయకులు మంచె రాజేశ్, గుర్రం రంజిత్‌రెడ్డి, కురుమ రమేశ్, అరుణ్ యాదవ్, కొండ్ర రవితేజ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 210 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

జగిత్యాలక్రైం: జగిత్యాల, ధర్మపురి, మెట్‌పల్లి పరిధిలో మద్యం దుకాణాలకు శుక్రవారం సాయంత్రం వరకు 210 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. జగిత్యాలలో 32 షాపులకు గాను ఇప్పటి వరకు 81 దరఖాస్తులు, ధర్మపురి సర్కిల్‌లో 14 షాపులకు గాను 84 దరఖాస్తులు రాగా, మెట్‌పల్లి సర్కిల్ పరిధిలో 25 షాపులకు 45 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 210 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారులు మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, సామాజిక వర్గానికి కేటాయించిన షాపులకు వారి కుల ధ్రువీకరణ పత్రం, దరఖాస్తు రుసుం రూ.2 లక్షల డీడీతో జగిత్యాల ధరూర్ క్యాంపులోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో అందించాలన్నారు. ఈనెల 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల 21న జగిత్యాలలోని వీరూపాక్షి గార్డెన్స్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు డ్రా పద్ధతిలో ఎంపికచేయనున్నట్లు తెలిపారు.

గందరగోళంలో వీఆర్‌ఏలు



పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న వీఆర్‌ఏలు

జగిత్యాల: జిల్లాలో గ్రామ రెవెన్యూ సహాయకుల సర్దుబాటు ప్రక్రియ పూర్తయింది. ఈ మేరకు 653 మంది వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. కాగా కొందరు సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలని కోర్టుకు వెళ్లగా గతనెల 24న జారీచేసిన జీవోకు ముందు ఉన్నతస్థితిని కొనసాగించాలని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. తమను రెవెన్యూ శాఖలోనే కొనసాగించాలని కొందరు కోరుతున్నారు. కాగా జిల్లాలో ఉన్న వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. శుక్రవారం ఆర్డర్స్ కాపీతో జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లారు. కాగా ఆర్డర్ కాపీలతో వచ్చినా కోర్టు ఆర్డర్‌తో ఏ డిపార్ట్‌మెంట్ వారు సైతం తీసుకోవడం లేదు. ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో వేచి ఉండాలని అధికారులు చెబుతున్నారు. కోర్టు నిర్ణయంతో అధికారులు సైతం తలలు పట్టుకోవడంతో వీఆర్‌ఏలు గందరగోళంలో ఉన్నారు. జిల్లాలోని 653 మంది వీఆర్‌ఏలు పోస్టింగ్ కోసం వేచి చూస్తున్నారు.

ఏఎన్‌ఎంల నిరసన

జగిత్యాలటౌన్: మొదటి ఏఎన్‌ఎంలతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంల సర్వీసును క్రమబద్ధీకరించాలని రెండో ఏఎన్‌ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట మానవహారం నిర్మించారు.మాధురిమ మాట్లాడుతూ కరోనాతో పాటు అనేక క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించిన తమపై ప్రభుత్వం వివక్ష చూపడం తగదన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు గూడూరి జయప్రద, మమత, పద్మ, స్వరూపరాణి, సుమలత, ఎలిజబెత్, రాజమణి, మధులత తదితరులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలి

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి పుప్పాల శ్రీధర్



వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి

మల్యాల: అసంక్రమిత వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వం అందిస్తున్న కిట్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి పుప్పాల శ్రీధర్ అన్నారు. మండలంలోని పోతారంలో శుక్రవారం పర్యటించారు. ప్రభుత్వం అందిస్తున్న ఎన్‌సీడీ కిట్లపై ఇళ్లకు వెళ్లి ఆరాతీశారు. గర్భిణులకు అందించే పోషకాహార కిట్స్, వినియోగం, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్‌సీడీ కిట్లు అందజేస్తోందని, ప్రజలు ఈ కిట్లను సద్వినియోగం చేసుకొని వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కిట్లు అందుతున్నాయా?

జగిత్యాల: వ్యాధిగ్రస్తులకు కిట్‌బ్యాగులు అందుతున్నాయా? లేదా? అని డీఎంహెచ్‌వో శ్రీధర్ ఆరాతీశారు. పేషెంట్లకు మందులు అందించడం తోపాటు, గర్భవతులకు పోషకాహార కిట్లు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య మిషన్ ప్రోగ్రాం అధికారి స్వామి, అసంక్రమిత వ్యాధుల కో ఆర్డినేటర్ మురళీ పాల్గొన్నారు.



పత్తి రైతు వినూత్న ప్రయోగం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లె గ్రామానికి చెందిన రైతు బూట్ల వెంకన్న పత్తిలో దున్నేందుకు వినూత్నంగా ఓ యంత్రం రూపొందించాడు. గ్రామాల్లో ఎడ్ల నాగలితో రైతులు దున్నడం లేదు. పలు కంపెనీలు రూపొందించిన యంత్రాలకు ధర అధికంగా ఉండడంతో, గ్రామానికి చెందిన వెంకన్న పాత ఆటో ఇంజిన్‌కు అవసరమైన మూడు నాగళ్లు, ఇతర పరికరాలు బిగించి యంత్రం తయారు చేశాడు. దీంతో గంటకు ఎకరం వరకు దున్నుతుందని రైతులు చెబుతున్నారు. ఆటో ఇంజిన్ కాకుండా తాను నాగళ్లు, ఇతర పరికరాలను బిగించేందుకు రూ.2వేల వరకు ఖర్చయినట్లు తెలిపాడు.

మండలం	కొత్త రైతులు	మొత్తం రైతులు
ఇబ్రహీంపట్నం	540	7674
మేడిపల్లి	467	9352
పెగడపల్లి	611	8958
సారంగాపూర్	292	5072
కొడిమ్యాల	564	7867
మల్యాల	528	7234
బుగ్గారం	241	4325
గొల్లపల్లి	689	10857
ధర్మపురి	462	10300
ఎండపల్లి	452	6186
రాయికల్	522	10346
కోరుట్ల	514	8236
జగిత్యాల రూరల్	704	11091
మల్లాపూర్	574	10324
కథలాపూర్	472	8354
వెల్గటూర్	316	5961
బీర్‌పూర్	144	5386
మెట్‌పల్లి	721	10621
జగిత్యాల	145	3227
మొత్తం	8,958	1,51,371

రైతుబీమాతో ధీమా

- జిల్లాలో 1,51,371 మంది అర్హులు
- కొత్తగా 8,958 దరఖాస్తుల స్వీకరణ
- రైతు కుటుంబాలకు అందునున్న సాయం

జగిత్యాల అగ్రికల్చర్ : రైతులు ప్రమాదవశాత్తు, లేదా అనారోగ్యంతో మృతిచెందితే కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు ప్రభుత్వం రైతుబీమాను అందజేస్తుంది. ఏటా వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన నూతన రైతులను రైతుబీమాలో చేర్చుతున్నారు. ఈ ఏడాది కొత్తవారికి రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వడంతో భూములు కొనుగోలు చేసిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకున్నారు.

1,51,371 మంది అర్హులు..

జిల్లాలో గుంట భూమి ఉన్న రైతుల నుంచి వంద ఎకరాలు ఉన్న రైతులను సైతం రైతుబీమాలో చేర్చారు. పట్టాదారు పాస్ పుస్తకం ఉండి, 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు గల వారు మాత్రమే రైతబీమాకు అర్హులు. వ్యవసాయ శాఖ క్లస్టర్ల పరిధిలో ఉన్న ఏఈవో ద్వారా దరఖాస్తులు స్వీకరించి, రైతుబీమా పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈనెల 5న గడువు ముగియగా జిల్లాలో రైతుబీమాకు 1,51,371 అర్హులు కాగా ఇప్పటికే 1,42,413 మంది రైతులు నమోదై, బీమా పాలసీలో ఉన్నారు. ఈ ఏడాది కొత్తగా భూమి కొనుగోలు చేసిన రైతులకు అవకాశం ఇవ్వడంతో 8,958 మంది రైతులు రైతబీమాలో చేరారు.



2018లో ప్రారంభం

రైతుబీమా పథకంలో చేరిన కొత్త రైతులకు ఎల్‌ఐసీ సంస్థ ద్వారా వ్యవసాయ శాఖ ఇన్సూరెన్సు పట్టా అందిస్తుంటుంది. ఈ పథకం 2018 ఆగస్టు 15న ప్రారంభం కాగా ఏటా ప్రభుత్వం ఎల్‌ఐసీ సంస్థకు రైతుల తరుపున ప్రీమియం చెల్లిస్తుంటుంది. ఒక్కో రైతుకు కనీసం రూ. 3,556 చొప్పున ప్రీమియాన్ని రైతు తరుపున ప్రభుత్వం ఎల్‌ఐసీకి చెల్లిస్తుంది. రైతు చనిపోతే, నామినికి రైతుబీమా కింద రూ.5 లక్షలు అందుతాయి.

రైతు కుటుంబాలకు అండగా



ఇటీవల భూమి కొనుగోలు చేయడంతో, రైతుబీమాకు దరఖాస్తు చేశా. త్వరలో ఎల్‌ఐసీ నుంచి పాలసీ బాండ్ వస్తుందని చెప్పారు. ప్రమాదవశాత్తు రైతు చనిపోతే బాధిత కుటుంబానికి బీమా డబ్బులు అందుతాయి. మా ఊరిలో చాలా కుటుంబాలకు రైతుబీమా అందింది.

– పుల్లి మల్లేశం గౌడ్, నర్సింగాపూర్, జగిత్యాల రూరల్ (మం)

దరఖాస్తులు స్వీకరించాం



రైతుబీమా దరఖాస్తుకు ఈ ఏడాది అనుమతి ఇవ్వడంతో కొత్తగా భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పోర్టల్‌లో అప్‌లోడ్ చేశాం. ఈనెల 5 వరకే గడువు ముగిసింది. కొత్తగా 8,958 మంది రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకున్నారు.

– పాక సురేశ్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి